క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఆరుద్ర నక్షత్ర వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని నాగులకుంట రోడ్డులో వెలసిన శ్రీనాగలింగేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విశ్వనాథ శాస్త్రి ఆధ్వర్యంలో స్వామి వారికి ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం, అన్నాభిషేకం, డ్రై ఫ్రూట్స్ అభిషేకాన్ని జరిపించారు. అనంతరం మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అర్చకులు మాట్లాడుతూ సంక్రాంతి భోగి రోజు పౌర్ణమి, ఆరుద్రా నక్షత్రంతో కూడిన సోమవారం రావడం ఎంతో విశేషమన్నారు.

ఉర్దూ పుస్తకావిష్కరణ



ఉర్దూ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ నౌమాన్

నంద్యాల(వ్యవసాయం): ప్రముఖ ఉర్దూ రచయిత అబ్దుల్ అజీజ్ రచించిన ఉర్దూ పుస్తకం సునిహేరే సఫాహత్ (గోల్డెన్ పేజేస్) పుస్తకాన్ని మాజీ ఉర్దూ అకాడమీ చైర్మన్ డాక్టర్ నౌమాన్ సోమవారం ఆవిష్కరించారు. నౌమాన్ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే రచనలు, పూర్వీకుల గత స్మృతులను నేటి తరానికి పరిచయం చేస్తూ అబ్దుల్ అజీజ్ కృషిని అభినందించారు. మున్సిపల్ కౌన్సిలర్ మహమ్మద్ తమీమ్, కో ఆప్షన్ మెంబర్ సలాముల్లా, అబ్దుల్‌సమ్మద్, డాక్టర్ అంజాద్, జునుల్లావుద్దీన్, ఫజులేరహిమాన్ పాల్గొన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి



మృతి చెందిన మణిశంకర్

దొర్నిపాడు: ఆరోగ్యం సరిగ్గా లేదని మనస్తాపం చెందిన యువకుడు 2024 డిసెంబర్ 25న కల్లాపు చల్లే రంగును నీళ్లలో కలుపుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఏఎస్ఐ రంగయ్య తెలిపిన వివరాలు...గుండుపాపల గ్రామానికి చెందిన మణిశంకర్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చాలా రోజుల నుంచి వైద్య చికిత్సలు చేయిస్తున్నప్పటికీ ఆరోగ్యం నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు ప్రయత్నించాడు. దీంతో వైద్యచికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. తల్లి సావిత్రి ఫిర్యాది మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెల్లడించారు.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద సోమవారం రాత్రి ట్రాక్టర్ బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మోటర్ సైకిల్‌పై వెళ్తున్న వెంకటరమణ, షఫీ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మెల్విన్‌జోన్స్ జయంతి

నంద్యాల(వ్యవసాయం): అంతర్జాతీయ లయన్స్ సేవా సంస్థ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జయంతిని పురస్కరించుకొని సోమవారం నంద్యాల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పట్టణ సమీపంలోని సెయింట్ యాన్స్ మనోవికాస కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ రవికృష్ణ, నిజాముద్దీన్, భవనాశి షషాంక్, సాయి శ్రీహిత్, నాగరాజు, ప్రిన్సిపాల్ కల్యాణి పాల్గొన్నారు.

డ్రోన్‌తో నిఘా



గోస్పాడు: మండలంలోని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలను నిరోధించడానికి డ్రోన్ కెమెరా ద్వారా పరిశీలిస్తున్నట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు. సోమవారం మండలంలోని రాయపాడు, తేళ్లపురి, యాళ్లూరు, జిల్లెల్ల గ్రామాలను డ్రోన్ కెమెరా ద్వారా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అల్లరి మూకలు పేకాట, నాటుసారా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం, తాగడం వంటి కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించేందుకు ప్రత్యేకంగా డ్రోన్ కెమెరాలతో పరిశీలించామన్నారు.

రామనామం చాలా గొప్పది



దొర్నిపాడు: రామనామం చాలా గొప్పదని..ప్రతి ఒక్కరూ జపించాలని బహుగ్రంథ కర్త శ్రీసాయిదాసు అన్నారు. సోమవారం రాత్రి రామచంద్రాపురం గ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకుని షిర్డీసాయి సత్సంగ సేవాసమితి సహకారంతో గ్రామపెద్దలు, సాయిసేవా సమితి ఆధ్వర్యంలో శ్రీమద్రామాయణ జ్ఞాన మహాయజ్ఞం నిర్వహించారు. రామాయణం, అందలి పాత్రల విశిష్టత గురించి ప్రవచనాలు చేశారు. రామాయణం సర్వ మానవాళికి మోక్షప్రదాయిని అని పేర్కొన్నారు .

సామూహిక భోగిపళ్ల వేడుకలు



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బాలాజీ కల్యాణ మండపంలో సోమవారం భోగిపండుగను పురస్కరించుకొని చిన్నారులకు సామూహిక భోగిపళ్ల కార్యక్రమం నిర్వహించారు. అర్చకుడు నిఖిలేష్‌శర్మ మాట్లాడుతూ పండుగరోజు చిన్నారులకు రేగిపండ్లచే తలపై వేయడం వల్ల పిల్లలు జ్ఞానవంతులు అవుతారని, రేగిపండ్లు సూర్యకిరణల్లో ప్రాణశక్తి అధికంగా గ్రహించి చిన్నారులను ఆరోగ్యవంతంగా చేస్తాయని శాస్త్రీయ నమ్మకమన్నారు. కొట్టి కృష్ణమూర్తి, చంద్రశేఖర్, లగిసెట్టి సురేష్ కుమార్, మహిళా మండలి సభ్యులు లగిసెట్టి భారతి, గీత, మల్లిక, కుసుమకుమారి పాల్గొన్నారు.

లోక కల్యాణం కోసం హోమాలు



నంద్యాల(వ్యవసాయం):పట్టణంలోని హౌసింగ్ బోర్డులో వెలసిన స్పటిక లింగేశ్వర ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా లోక కల్యాణం కోసం హోమాలు నిర్వహించారు. స్పటిక లింగేశ్వరుడికి మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం జరిపించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం యోగానంద స్వామి ఆధ్వర్యంలో హోమాలు చేపట్టి పూర్ణాహుతి గావించారు.





తెల్లవారుజామునే ఇంటి ముందు ముగ్గు వేస్తున్న దృశ్యం,రామచంద్రా పురంలో భోగిమంటలు

ఇంటింటా భోగి వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): తెలుగు ప్రజలు సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకొనే అతి పెద్ద పండుగ. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ. పట్టణంలో పిల్లలు, పెద్దలు సంక్రాంతిని పురస్కరించుకొని భోగి రోజు సోమవారం తెల్లవారుజామునే ఇంటి ముందు భోగి మంటలు వేశారు. అనంతరం కల్లాపు చల్లి రంగురంగుల ముగ్గులను వేసి గొబ్బెమ్మలను పూలతో అలంకరించి, వాటిలో నవధాన్యాలు వేశారు. ఉదయాన్నే మంగళస్నానం ఆచరించిన అనంతరం సద్ద రొట్టెలు, కలగూర, పులగం, నువ్వులు, బెల్లంతో చేసిన పొడి, వెన్న స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులు గుమ్మడి కాయలతో ఇంటికి దిష్టితీశారు. సాయంత్రం చిన్నపిల్లలకు రేగిపండ్లుపోశారు.

దొర్నిపాడు: రామచంద్రాపురం గ్రామంలో పువ్వాడ వెంకటరమణయ్య ఆధ్వర్యంలో మహిళలు భోగి మంటల చుట్టు సంప్రదాయ నృత్యాలు చేశారు. మంగళవారం గ్రామంలో సీతారాముల కల్యాణం అనంతరం తెప్పోత్సవం నిర్వహించనున్నారు.

ఘనంగా భోగి పండుగ

రుద్రవరం: మండలంలో సోమవారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే మహిళలు భోగి మంటలు వేశారు. పాత వస్తువులను మంటల్లో వేశారు. భోగ భాగ్యాలు కలగాలని మంటల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పోటాపోటీగా అందమైన ముగ్గులు వేశారు.



హరిదాసుకు దానం చేస్తున్న దృశ్యం



రుద్రవరంలో భోగి మంటలు వేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన



చాగలమర్రి కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో నగర సంకీర్తనకు హాజరైన ఆర్యవైశ్యులు

చాగలమర్రి: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆర్యవైశ్యులు సోమవారం వేకువజాము నుంచే నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు పూలేటి రాధాక్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం ఎదుట భోగి మంటలు వేశారు. రంగ వల్లులు, గొబ్బెమ్మలు పెట్టి భోగి శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం పిల్లలపై తల్లిదండ్రులు, పెద్దలు భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు లక్ష్మణబాబు, సభ్యులు నవత ప్రసాద్, లక్ష్మీనారాయణ, క్రిష్ణం ప్రసాద్, బాబు, ఆనంద్, నాగేంద్రప్రసాద్, మల్లికార్జున, బచ్చు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయం ఎదుట భోగి మంటలు

కమనీయం..గోదాదేవి కల్యాణం





సంజీవనగర్ రామాలయంలో గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం అనంతరం హారతినిస్తున్న పండితులు, వజ్రాభరణాలంకరణలో దేవదేవుడు



వేడుకను తిలకిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): లోక కల్యాణం కోసం తిరుప్పావై వ్రతసమాప్తిలో భాగంగా స్థానిక సంజీవ నగర్‌లోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో సోమవారం గోదాదేవి రంగనాథస్వామి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉదయమే మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామి వారిని వజ్రాభరణ కవచంతో ప్రత్యేకంగా అలంకరించారు. గోదాదేవి, రంగనాథస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ వేదయుక్తంగా కల్యాణం జరిపించారు. కంకణ ధారణ, నలుగు, మాంగళ్య ధారణ తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా చేపట్టి తలంబ్రాల తంతు పూర్తి చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు మహామంగళ హారతులు పట్టారు. టీటీడీ బ్రహ్మోత్సవాల వ్యాఖ్యాత దీవీ హయగ్రీవాచారి గోదాదేవి కల్యాణం వ్యాఖ్యానం భక్తులను ఆకట్టుకుంది. పెళ్లి పెద్దలుగా వంకదార మధుసూదనరావు కుటుంబ సభ్యులు, వెన్నపూస సురేష్‌రెడ్డి దంపతులు వ్యవహరించారు. వేడుకను తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భగవత్ సేవా సమాజ్ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, సభ్యుడు దేవరశెట్టి శ్రీనివాస్, వసంతరాఘవ, జయప్రకాష్, పద్మనాభయ్య, గురుమూర్తి, సాయికృష్ణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలతో శిరివెళ్ల సీఐ



చాగలమర్రి: ముగ్గుల పోటీల్లో మహిళలు



చాగలమర్రి: విజేతకు బహుమతి అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత లక్ష్మీరెడ్డి



ముగ్గులను పరిశీలిస్తున్న సీఐ



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ఎస్ఐ నగీన, ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు ఉషారాణి

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు ఎద్దుల రాజేశ్వరి, లక్ష్మీరెడ్డి దంపతులు ముగ్గుల పోటీలను నిర్వహించారు. గ్రామానికి చెందిన యువతులు, మహిళలు సుమారు 30 మంది పండుగ ఉట్టిపడేలా వివిధ రకాల ముగ్గులు వేశారు. ప్రథమ బహుమతిగా రూ.1516, ద్వితీయ బహుమతికిగా రూ.1116,తృతీయ బహుమతిగా రూ.5116లు అందజేశారు. అలాగే కన్సోలేషన్ బహుమతులుగా 10 మందికి గృహోపకరణాలను అందించారు. గ్రామ నాయకులు గణపతిరెడ్డి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ముగ్గుల పోటీలు

శిరివెళ్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి ప్రవళిక, ద్వితీయ బహుమతి తులసీకి సీఐ వంశీధర్, ఎస్ఐ చిన్న పీరయ్య బహుమతులను అందజేశారు.

సంక్రాంతి ముగ్గులు.. సంస్కృతికి చిహ్నాలు

ఆళ్లగడ్డ: సంక్రాంతి ముగ్గులు మన సంస్కృతి సంప్రదాయాలకు చిహ్నాలని ఆళ్లగడ్డ ఎస్ఐ నగీన అన్నారు. సంక్రాంతి మహోత్సవాల్లో భాగంగా స్థానిక ఆచారి కాలనీలోని కాలికామాత దేవాలయ ఆవరణలో సోమవారం భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నపిల్లలకు రేగి పండ్లతో భోగి స్నానాలు చేయించారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఎస్ఐ, ఇన్నర్‌విల్ అధ్యక్షురాలు మాట్లాడుతూ.. పాశ్చత్య పోకడల మోజులోపడి మన సంస్కృతులను విస్మరించరాదన్నారు. ఇలాంటి పోటీల ద్వారా యువతుల మధ్య స్నేహ భావం, పనిపై ఏకాగ్రత, నైపుణ్యాల ప్రదర్శనకు అవకాశం ఏర్పడుతుందన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శిల్పి దురిగడ్డ రవీంద్రాచారి, వైస్ ప్రిన్సిపల్ గంగన్న పాల్గొన్నారు.

సంస్కృతిని ప్రోత్సహించేందుకే ముగ్గుల పోటీలు

నంద్యాల(న్యూటౌన్): సంస్కృతిని పట్టణాల్లో ప్రోత్సహించేందుకే ముగ్గుల పోటీలను సీపీఎం శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించినట్లు జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్‌లోని కేశవరెడ్డి పబ్లిక్ స్కూల్ ఆవరణలో ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ అరుణకుమారి, దిశా సీఐ జయరాం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, మాస్టర్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

అన్నదాతకు గుండె కోత



ఎర్రగుడిదిన్నెలో కోత కోసిన జొన్న(ఇన్‌సెట్) చిలుకలూరులో నేలవాలిన జొన్న పంట

రుద్రవరం: మండలంలోని ఎర్రగుడిదిన్నె, చిలుకలూరు, పేరూరు, మందలూరు, నక్కలదిన్నె, చందలూరు, తదితర గ్రామాల పరిధిలో జొన్న కోతలు మొదలయ్యాయి. అయితే విపత్తుల కారణంగా కోత దశలో ఉన్న జొన్న నేలవాలడం చూసి అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. పంట కోత కోయించేందుకు ఖర్చులు పెరిగి అదనపు భారం పడుతోందని రైతులు వాపోయారు. అంతేకాక పంట నేలవాలడంతో గింజలు రాలి దిగుబడి తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గతేడాది ఎకరానికి 18 నుంచి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ధర కూడా క్వింటాలుకు రూ.3 వేలకు పైగానే ఉండడంతో లాభాలు పొందారు. ఈ ఏడాది ఎకరానికి 10 క్వింటాళ్లకే దిగుబడి పడిపోయేలా ఉంది. ప్రభుత్వం జొన్నకు మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నాట్యాచారుడికి నృత్యరత్న పురస్కారం



రాయలసీమ నృత్యరత్న పురస్కారం అందుకుంటున్న పల్లంశెట్టి సురేష్

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన ప్రముఖ నాట్య గురువు డాక్టర్ పల్లంశెట్టి సురేష్ రాయలసీమ నృత్యరత్న పురస్కారం సోమవారం ప్రొద్దుటూరులో అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో రాయలసీమ సంగీత నృత్యోత్సవాల్లో భాగంగా శ్రీనటరాజ కళాక్షేత్రం వ్యవస్థాపకులు పఠాన్ మొహిద్దీన్ ఖాన్ పురస్కారాన్ని అందజుశారని చెప్పారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

NGO కాలనీ బ్రాంచ్, నంద్యాల, మెయిన్‌రోడ్డు, NGO కాలనీ, నంద్యాల.

Ref No. 25401/SARFAESI/2024-25/04, తేది: 09-01-2025

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కోసం)

{సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(1)}

ఇంతకుముందరి ఆంధ్రాబ్యాంక్, ఇప్పటి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, NGO కాలనీ బ్రాంచ్ (25401) అధీకృత అధికారియగు దిగువ సంతకందారు, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13 (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ, దిగువ తెలిపిన వారికి 08-11-2024 తేదీగల డిమాండ్ నోటీసు జారీచేసి,

దరఖాస్తుదారు శ్రీ దొంతరబోయిన రామ్‌సుధీర్ తండ్రి డి. వెంకటేశ్వర్లు, ఇ.నం.2-17, బీసీ కాలనీ, కొరటమద్ది గ్రామం, గడివేముల మండలం, నంద్యాల - 518511	దరఖాస్తుదారు శ్రీ దొంతరబోయిన రామ్‌సుధీర్ తండ్రి డి. వెంకటేశ్వర్లు, ప్లాట్ నం.16 (పశ్చిమ భాగం), సర్వే నం.2003/1, వార్డు నం.21, ఫారూఖ్‌నగర్, నంద్యాల - 518501
సహ-దరఖాస్తుదారు శ్రీమతి డి. లక్ష్మీదేవి భర్త డి. రామ్‌సుధీర్, ఇ.నం.2-17, బీసీ కాలనీ, కొరటమద్ది గ్రామం, గడివేముల మండలం, నంద్యాల - 518511	సహ-దరఖాస్తుదారు శ్రీమతి డి. లక్ష్మీదేవి భర్త డి. రామ్‌సుధీర్, ప్లాట్ నం.16 (పశ్చిమ భాగం), సర్వే నం.2003/1, వార్డు నం.21, ఫారూఖ్‌నగర్, నంద్యాల - 518501

సదరు నోటీసులో తెలిపిన మొత్తం **రూ.36,52,326.89 (ముప్పై ఆరు లక్షల యాభై రెండు వేల మూడు వందల ఇరవై ఆరు రూపాయల ఎనభై తొమ్మిది పైసలు మాత్రమే)**లను సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించాలని కోరారు. రుణగ్రహీత సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ, దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **09-01-2025**న స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. సదరు ఆస్తితో ఎలాంటి వ్యవహారములు జరుపరాదని ముఖ్యంగా రుణగ్రహీతను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తితో జరిపే ఎలాంటి వ్యవహారాలైనా మొత్తం **రూ.37,37,126.89 (ముప్పై ఏడు లక్షల ముప్పై ఏడు వేల నూట ఇరవై ఆరు రూపాయల ఎనభై తొమ్మిది పైసలు మాత్రమే)** మరియు దానిపై వడ్డీ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చార్జ్‌కు లోబడి ఉంటాయి.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకునేందుకు లభించే సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతను కోరడమైనది.

స్థిరాస్తి వివరణ : శ్రీ డి. రామ్‌సుధీర్‌కు చెందిన నంద్యాల జిల్లా మరియు టౌన్, నంద్యాల మున్సిపల్ పరిధిలోని ఫారూఖ్‌నగర్, వార్డు నం.21, సర్వే నం.2003/1లోని 101.50 చ.గజాల విస్తీర్ణం గల ప్లాట్ నం.16 పైకి (పశ్చిమ భాగం) వద్దగల నివాస భూమి మరియు భవనం యావత్తు మరియు **సరిహద్దులు:- తూర్పు:** ప్లాట్ నం.16 తూర్పువైపు భాగం, **పశ్చిమం:** 25 అడుగుల వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** ప్లాట్ నం.17, **దక్షిణం:** ప్లాట్ నం.15.

తేది: 09-01-2025, ప్రదేశం: నంద్యాల — అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

గోదాదేవికి విశేష పూజలు



తిరుమంజన సేవలో కొలువైన ఉత్సవమూర్తులు

ఆళ్లగడ్డ: అహోబిలంలో ధనుర్మాస పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం గోదాదేవి అమ్మవారు విశేష పూజలు అందుకున్నారు. వేకువజామున భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజ లు చేశారు. అనంతరం గోదాదేవి నవకలశ భోగి తిరుమంజనం శాస్త్రోక్తంగా చేపట్టి రాత్రి ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

డోన్ రూరల్: కొత్తకోట గ్రామంలో సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా ఆరుపళ్లలోపు ఎద్దులకు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో నాగర్ కర్నూలు జిల్లా లింగాల మండలం రాయవరం గ్రామానికి చెందిన ఎం.అక్షరరెడ్డి వృషభాలు విజేతగా నిలిచి రూ.35 వేలు కైవసం చేసుకున్నాయి. తరువాత స్థానాల్లో కర్నూలు జిల్లా తాండ్రపాడు గ్రామానికి చెందిన చిన్నరత్నం రూ.25 వేలు, గద్వాల జిల్లా ఇటుకల మండలానికి చెందిన అబ్దుల్‌బాషా రూ.15 వేలు, అనంతపురం జిల్లా ఆత్మకూరుకు చెందిన గులి విశ్వనాథ్‌రెడ్డి రూ.10 వేలు, వైఎస్సార్ జిల్లా పాలమపల్లె గ్రామానికి చెందిన రాయల్‌రెడ్డి రూ. 8 వేలు, ప్యాపిలి మండలానికి చెందిన శేఖర్ రూ.5 వేలు కైవసం చేసుకున్నారు.

వైభవం.. పల్లకోత్సవం



బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, నైవేద్య సమర్పణ చేసి కర్పూర నీరాజనాలు పలికారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ఈఓ చంద్రుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.